మహిళ వద్ద దరఖాస్తును స్వీకరిస్తున్న సీతక్క

సీతక్క.. అంటేనే ఇష్టం..!

- పదవులు శాశ్వతం కాదు.. విలువలు ముఖ్యం
- ప్రజాపాలన ప్రారంభోత్సవంలో సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"నన్ను మేడం అనొద్దు.. సీతక్క అనే పిలవాలి. అలా పిలిస్తేనే నాకిష్టం.. మేడం అంటే.. దూరం అయిపోతం. సీతక్క అంటేనే మీ అక్క, మీ చెల్లిలాగా కలిసిపోతాం.." అని పంచాయతీరాజ్, మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. పదవులు శాశ్వతం కాదని.. విలువలు ముఖ్యమని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం జామ్ని గ్రామంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఇది గడీల పాలన కాదని.. గల్లీ బిడ్డల పాలనని గుర్తు చేశారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని, పేదరికాన్ని తరమికొట్టాలంటే సంక్షేమ పథకాలతో పాటు స్వయం ఉపాధి మార్గాలు చూపించాల్సిన అవసరం ఉందని చెప్పారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా, జైనథ్ ఎంపిపి మార్శెట్టి గోవర్ధన్, జడ్‌పిటిసి అరుంధతి, డిఆర్‌డిఒ కిషన్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ గురువారం విడుదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు అధికారులు గురువారం పూర్తి షెడ్యూల్ విడుదల చేశారు. రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

మరోవైపు, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు (జనరల్/వొకేషనల్ కోర్సులు) ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు రెండో శనివారం, ఆదివారాల్లోనూ జరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్ బి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో సెషన్‌లో జరుగుతాయని వివరించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఫిబ్రవరి 16న నిర్వహిస్తారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్ష తేదీలివే..

ఫిబ్రవరి 28 - పార్ట్ 2 (సెకండ్ లాంగ్వేజి పేపర్-1).
మార్చి 1 - పార్ట్ 1 (ఇంగ్లీష్ పేపర్-1).
మార్చి 4 - పార్ట్ 3 (మేథమేటిక్స్ పేపర్-1ఏ, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1)
మార్చి 6 - మేథమేటిక్స్ పేపర్ 1బి, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్1.
మార్చి 11- ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1.
మార్చి 13 - కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1.
మార్చి 15 - పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్ పేపర్-1 (ఫర్ బైపిసి స్టూడెంట్స్).
మార్చి 18 - మోడరన్ లాంగ్వేజ్ పేపర్-1, జియోగ్రఫీ పేపర్-1.

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్ష తేదీలివే..

ఫిబ్రవరి 29 - పార్ట్ 2 (సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2).
మార్చి 2 - పార్ట్ 1 (ఇంగ్లీష్ పేపర్-2).
మార్చి 5 - పార్ట్ 3 (మేథమేటిక్స్ పేపర్ 2ఏ, బోటనీ పేపర్ 2, పొలిటికల్ సైన్స్ పేపర్ 2).
మార్చి 7 - మేథమేటిక్స్ పేపర్ 2బి, జూవాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్2
మార్చి 12 - ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2.
మార్చి 14 - కెమిస్ట్రీ పేపర్ -2, కామర్స్ పేపర్-2
మార్చి 16 - పబ్లిక్ ఆడ్మినిస్ట్రేషన్ పేపర్-2, బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్ పేపర్-2 (ఫర్ బైపీసీ స్టూడెంట్స్).
మార్చి 19 - మోడరన్ లాంగ్వేజ్ పేపర్-2, జియోగ్రఫీ పేపర్-2.

విద్యార్థుల ఇష్టాలను పరిగణనలోకి తీసుకోవాలి

- అందరికి విద్యనందించటంలో ఓపెన్ వర్సిటీ పాత్ర కీలకం
- యుజిసి చైర్మన్ జగదీష్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులకు తాము కోరుకున్న విద్యను అభ్యసించే స్వేచ్ఛ ఉండాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) చైర్మన్ జగదీష్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఒక కోర్సును ఎంపిక చేసుకున్న తర్వాత తమ అభీష్టం మేరకు మరో కోర్సులోకి వెళ్లేందుకు ఆసక్తి చూపించే విద్యార్థుల ఇష్టాలను విద్యాలయాలు పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. ఒకే సమయంలో పలు కోర్సులను చదివే ప్రతిభ కలిగిన విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలి. రెగ్యులర్ విద్యార్థులు ఓపెన్ విద్యా విధానంలోకి, అదే విధంగా ఓపెన్ విద్యా విధానంలోని వారు రెగ్యులర్ విద్యార్థులుగా మారేందుకు అవకాశమివ్వాలని సూచించారు. ఉన్నత విద్యలో సంస్కరణలు, 2017 యుజిసి రెగ్యులేషన్స్ అమల్లోకి వచ్చాక చాలా మార్పులు వచ్చాయని ఆయన చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 25వ స్నాతకోత్సవంలో జగదీష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 43 మందికి గోల్డ్ మెడల్స్‌ను, 31,729 మందికి డిగ్రీ, డిప్లొమా పట్టాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మారు మూల గ్రామీణ ప్రాంతాల వారు, గృహిణులు, ఆటోడ్రైవర్లు, ఖైదీలు పట్టాలు తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా అనేక యూనివర్సిటీల స్నాతకోత్సవాల్లో తాను పాల్గొన్నప్పటికీ, ఇంతటి వైవిధ్యం ఎక్కడా చూడలేదని తెలిపారు. ఇలాంటి వారు విద్యావంతులైతే వారి సామాజిక, ఆర్థిక పరిస్థితిలో మార్పు వస్తుందని తెలిపారు. తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఓపెన్ యూనివర్సిటీ మారుమూల ప్రాంతాల వారికి నాణ్యమైన విద్యను అందిస్తుండటాన్ని ఆయన అభినందించారు. యుజిసి ఆమోదం పొందిన యూనివర్సిటీల్లోనే చేరాలని కోరారు.

గవర్నర్ సందేశం

నూతనంగా పట్టాలు తీసుకున్న విద్యార్థులకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ శుభాకాంక్షలు తెలిపారు. అనివార్య కారణాలతో తాను నేరుగా స్నాతకోత్సవానికి హాజరు కాలేకపోతున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు గవర్నర్ పంపిన సందేశాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.సీతారామారావు చదివి వినిపించారు. ప్రముఖ విద్యావేత్త వి.ఎస్.ప్రసాద్‌కు డాక్టర్ ఆఫ్ లెటర్స్‌తో ప్రశంసా పత్రాన్ని జగదీష్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, డైరెక్టర్లు, డీన్స్, బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మేడిగడ్డకు మంత్రుల బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. శుక్రవారం ఉదయం పది గంటలకు హైదరాబాద్ నుంచి మంత్రులు మేడిగడ్డకు బయలుదేరుతారు. బ్యారేజీ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుపై నీటిపారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుల వివరాలు.. ప్రాజెక్టు వ్యయం, దాన్ని కట్టడం ద్వారా జరిగిన లాభ, నష్టాలపై వివరణ ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన విద్యుత్తు, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల సమస్యలు, వాటి పరిష్కారాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రాజెక్టు నిర్మాణ సంస్థలు, సబ్ కాంట్రాక్టర్లు, నిర్మాణంతో సంబంధం ఉన్న అందరూ సమావేశంలో పాల్గొనే విధంగా సమాచారం అందించాలని ఇఎన్‌సిని మంత్రులు ఆదేశించారు.

రాష్ట్ర సంపదను ప్రజలకు అంకితం చేస్తాం

- అందరికీ ఆరు గ్యారంటీలు ఇస్తాం
- బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గం
- తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపిస్తాం
- రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో 'ప్రజాపాలన' కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఒక వర్గానికి, ఒక వ్యక్తికి సంబంధించిన ప్రభుత్వం కాదు మాది. మా పార్టీలోకి వస్తేనే ఇల్లు ఇస్తామని బెదిరించే ప్రభుత్వం కాదు మాది. తెలంగాణ బిడ్డలై ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు గ్యారంటీలు పొందడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి రాజకీయ పక్షపాతం వహించం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలు కచ్చితంగా అందించి రాష్ట్రాన్ని, సంపదను ప్రజలకు అంకితం చేసే ప్రజా ప్రభుత్వం మాది' అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించడమే కాంగ్రెస్ ప్రజాపాలన ఉద్దేశమని తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామపంచాయతీ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయ హస్తం, ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. దశాబ్ద కాలం పాటు పరిపాలన చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయకపోవడం దుర్మార్గమన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి ఉన్న ఇందిరమ్మ ఇళ్లనూ ఇవ్వకుండా పేదలను మోసం చేసిందని చెప్పారు. పదేళ్లలో రాష్ట్ర ప్రజలు నీళ్లు, నిధులు, నియామకాలు పొందలేద న్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దగ్గరకు వెళ్లి ఆరు గ్యారంటీలు అమలు చేయడానికి చేస్తున్న కార్యక్రమమే ప్రజాపాలన అని వివరించారు.

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు కావొద్దని కోరుకుంటున్న బిఆర్ఎస్ కలలను నిజం కానివ్వబోమన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం ముగిసిన గంటలోపే అదే ప్రాంగణంలో రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచితంగా ఆర్‌టిసి బస్సు ప్రయాణం కల్పించే పథకాన్ని ప్రారంభించి దిగ్విజయంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.పది లక్షలకు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అభయ హస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కోసం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ చేపడుతున్నట్టు చెప్పారు. నేటి నుంచి జనవరి 6 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ పెట్టి దరఖాస్తులను స్వీకరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన కాంగ్రెస్ ఆవిర్భావం రోజున ప్రజల దగ్గరకే వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రజా పాలన తెలంగాణలో మొదలైందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ మార్చ్ పేరిట తాను పాదయాత్ర చేసిన సమయంలో మహిళలు వారి సమస్యలు చెప్పుకున్నారని వివరించారు. నాడు పాదయాత్రలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్‌కు వచ్చిన సందర్భంగా ఇళ్లు లేని పేద ప్రజలు తనను కలిశారని గుర్తు చేశారు. నాటి హామీ మేరకు నేడు వారికి ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌సుల్తానియా, పంచాయతీరాజ్ కమిషనర్ హన్మంత రావు, కలెక్టర్ గౌతమ్ పొట్రు, రాచకొండ సిపి జి సుధీర్‌బాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నీరజ సాహిత్యం సుకుమార భావాల అల్లిక

- ప్రముఖ కవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - కల్చరల్

నీరజ కవిత్వం సుకుమార భావాల అల్లిక అని ప్రముఖ కవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో నీరజ హరి ప్రభల రచించిన ఊహల అల్లికలు కవితా సంపుటి ని సుద్దాల అశోక్ తేజ ఆవిష్కరించి మాట్లాడారు. కవిత్వ అంటే తన హదయంకు తాకిన సంఘటన లేక దృశ్యంను అంతే స్థాయిలో ఇతరులు హృదయాలకు హత్తుకునేలా చెప్పటమే నని అభివర్ణించారు.నీరజ కవిత్వంలో అభివ్యక్తి మనసులు తాకు తుందని వివరించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ గ్రంథ ప్రచురణ చేయటం ఒక ఎత్తు ఐతే మార్కెట్ చేసుకోవటం ఇంకో ఎత్తు అన్నారు. నీరజ తన కథలలో కవిత్వంలో జటిల మార్గంకాక అందమైన భావాలను అనవసర వర్ణనలు లేకుండా వ్యక్తీ కరించారని అభినందించారు. ప్రముఖ వైనిక గురువులు అయ్యగారి శ్యామ సుందర్, జయలక్ష్మి లతో కలసి నీరజ రచించిన నీరజ కదా కదంబం కథల సంపుటిని ఆవిష్కరించారు. వేదికపై జ్యోతి వల్లభోజుల, డాక్టర్ కెవి కృష్ణకుమారిలు నీరజను అభినందించారు. వంశీ రామ రాజు సభకు స్వాగతం పలుకగా శైలజ సుంకరపల్లి కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు తొలుత మాధురీ కృష్ణ(అమెరికా) పాడిన అన్నమయ్య కీర్తనలు శ్రోతలను పరవసుల చేశాయి.

దక్షిణ మధ్య రైల్వేలో ఉత్తమ డివిజన్ సికింద్రాబాద్

- డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేశ్ కుమార్ జైన్
- రైల్వే సేవా పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగులు, సిబ్బంది అంకితభావం..సమిష్టి కృషి వల్లే దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రా బాద్ ఉత్తమ డివిజన్‌గా నిలిచిందని సికింద్రా బాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేశ్ కుమార్ జైన్ అన్నారు. 68వ రైల్వే వారోత్సవాల్లో భాగంగా గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్ ఆడిటోరియం లో రైల్వే సేవా- పురస్కారాలు-2023' ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ డివిజన్ ప్రయాణికులు, సరుకు రవాణాలో ముందంజలో ఉండడం, ఆదాయం పెంపులో పెరుగుదల, ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టడం తదితర అన్ని విభాగాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిందని తెలిపారు. అందుకు కారకులైన సిబ్బంది, ఉద్యోగులను ప్రశంసించారు. అనంతరం విభాగాల వారీగా, వ్యక్తిగతంగా ప్రతిభ కనబరిచిన సిబ్బందికి మెడల్స్‌ను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మాలిని జైన్, ఎడిఆర్ఎంలు జి.సుబ్రమణ్యం, రాజీవ్ కుమార్, గోపాల్, ఎస్ఇపివా అభిలాశ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వరంగంలో విద్య ఉంటేనే విప్లవాత్మక మార్పులు

- విద్య ప్రయివేటీకరణతో పెరుగుతున్న అంతరాలు
- సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలి
- పట్టణాల్లో కొత్త పాఠశాలలను తెరవాలి
- చర్చాగోష్టిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వరంగంలోనే విద్యారంగం ఉండాలనీ, అప్పుడే విప్లవాత్మకమైన మార్పులు రావడం సాధ్యమవుతుందని తెలంగాణ పౌరస్పందన వేదిక (టిపిఎస్‌వి) రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. టిపిఎస్‌వి ఆధ్వర్యంలో 'ప్రభుత్వ బడులు నిలబడాలి- చదువులో అంతరాలు పోవాలి'అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చర్చా గోష్టి నిర్వహించారు. అధ్యక్షత వహించిన నర్సిరెడ్డి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో విద్యాప్రయివేటీకరణ ఎక్కువగా ఉంద న్నారు. సర్కారు బడుల్లో ఉచిత విద్య, ప్రయివేటు బడుల్లో ఏడాదికి రూ.20 వేల నుంచి రూ. 6లక్షల వరకు వసూలు చేసే పరిస్థితి ఉందని వివరిం చారు. అందరికీ ఒకేరకమైన విద్య అందడం లేదన్నారు. దీంతో విద్యారంగంలో అంతరాలు పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటు విద్యారంగం సమాజానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వ, మండల పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలలను కనీసం 75 నుంచి వంద మంది విద్యార్థులుండేలా రీఆర్గనైజ్ చేయాలని కోరారు. తరగతికొక గది, టీచర్, పాఠశాలకొక ప్రధానోపాధ్యాయుడు, సర్వీసు పర్సన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైన చోట విద్యా ర్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలనీ, లేకుంటే సర్కా రు బడులు నిలబడబోవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా నియమిం చాల న్నారు. ప్రాథమికోన్నత పాఠశాల (యుపిఎస్)ల్లో విద్యా ర్థుల సంఖ్య తక్కువగా ఉంటోందనీ, అవసరమైన చోట ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలనీ, లేనిచోట ప్రాథమిక పాఠశాలలుగా డీగ్రేడ్ చేయాలని చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని, కంప్యూటర్ విద్యకోసం ప్రత్యేక టీచర్‌ను నియమించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలపై పర్యవేక్షణ నిరంతరం కొనసాగించేందుకు మండల విద్యాధికారులు (ఎంఇఒ), ఉప విద్యాధికారులు (డిప్యూటీఇఒ) పోస్టులను మంజూరు చేసి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాలకు డిఇఒ పోస్టులను మంజూరు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ

పోస్టులను భర్తీ చేయాలనీ, అవసరమైతే విద్యావాలంటీర్లను నియమించాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో అవసరమైన చోట కొత్త ప్రభుత్వ పాఠశాలలను తెరవాలని సూచించారు. బస్తీ దవాఖానాల తరహాలో కాకుండా అన్ని హంగులతో బడులను ప్రారంభించాలన్నారు. మధ్యాహ్న భోజనం బిల్లు లను ప్రతినెలా ఐదో తేదీలోగా ఏజెన్సీలకు ఇవ్వాలని చెప్పారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు చొరవ చూపితే ప్రభుత్వ పాఠశాలలను బాగుచేసుకోవచ్చని అన్నారు. హక్కులతోపాటు విద్యావిధానానికి సంబంధిం చిన అంశాలపై, బోధనపై కేంద్రీకరించి పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులతోపాటు ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించా లని కోరారు. కామన్ స్కూల్ విధానం కోసం పోరాడా లన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం బోధనేతర అంశాలైన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టిసారిం చాలని సూచించారు. సిలబస్‌లో అశాస్త్రీయ అంశాలను చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. గత పాలకుల హయాంలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని విమర్శిం చారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బాగుచేస్తా మంటూ కాంగ్రెస్ ప్రకటించిందనీ, దీన్ని స్వాగతిస్తున్నా మని అన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి : రాధేశ్యాం

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని టిపిఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల ప్రయివేటు విద్యాసంస్థలకే మేలు జరుగుతున్నదని అన్నారు. ఆ నిధులతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతులను మెరుగు పర్చే అవకాశముందన్నారు. కేరళ, ఢిల్లీ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రభుత్వ విద్యారంగం బాగుందన్నారు. రాష్ట్రంలోనూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు పాలకులు దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్‌వి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లక్ష్మణ్‌రావు, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎంఎ సమ్మద్, మేడ్చల్ అధ్యక్షులు పి సురేష్, సలహాదారులు మస్తాన్ రావు, జతిన్‌తోపాటు వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చరిత్రను కాపాడాల్సిన బాధ్యత నేటి చరిత్రకారులదే

- జెఎన్‌యు రిటైర్డ్ ప్రొఫెసర్ మృధులా ముఖర్జీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతదేశ చరిత్రను కాపాడాల్సిన బాధ్యత నేటి చరిత్ర కారులపై ఉందని న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగం విశ్రాంత అచార్యులు మృధులా ముఖర్జీ అన్నారు. 82వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు..డిసెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరి యంలో విసి ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన గురువారం ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తుంద న్నారు. నిజాన్ని రక్షించాలని, సెక్యులర్, సోషలిస్ట్, ప్రజాస్వామ్య మౌలిక భావాలను కాపాడుకోవాలని తెలిపారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో భారత దేశ చారిత్రక మూలాలు దెబ్బ తినకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత చరిత్ర కారు ల భుజస్కంధాలపై ఉందన్నారు. కాకతీయుల చారిత్రక సంపద, నిజాం వ్యతిరేక పోరాటంలో తెలుగు ప్రజల గుర్తింపు కోసం చేసిన ఉద్యమాలు, పోరాటాలు చరిత్రలో నిక్షిప్తమై ఉన్నాయ న్నారు. పోరాట స్ఫూర్తి గలిగిన రాణి రుద్రమదేవి, రావి నారాయణ రెడ్డి, ఆరుట్ల రామచంద్రా రెడ్డిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1984లో తన పరిశోధన 'ప్రాజెక్ట్ ఆన్ ఫ్రీడం స్ట్రగుల్' కోసం నగరానికి వచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ ప్రాంత ప్రజల పోరాట పటిమ, త్యాగం, వీరత్వాన్ని కొనియాడారు. అనంతరం ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్, జెఎన్ యూ విశ్రాంత ఆచార్యులు ఆదిత్య ముఖర్జీ మాట్లాడుతూ.. చరిత్ర తుంగలో తొక్కబడుతుందని, నెహ్రూను చాలా కఠోరంగా చూపిస్తున్నారని అన్నారు. నెహ్రూను భారతదేశ ప్రజల మనస్సుల నుంచి చెరిపేసేలా అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. దేశ విభజన, పాకిస్తాన్, చైనా సమస్య, వ్యవసాయ సంక్షోభం, కాశ్మీర్ సమస్యతో పాటు ఇటీవల కాలంలో విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, రాజ్యాంగ సవరణ, ప్రజాస్వా మ్యానికి ప్రశ్నార్థ కాలుగా మారాయని ఆరోపించారు. సభాధ్యక్షులు ఆచార్య తాటి కొండ రమేష్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ వేదికగా 30 ఏండ్ల కిందట నిర్వహించిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను గుర్తు చేస్తూ, తన హయంలో మరొక్కసారి నిర్వహించటం గౌరవంగా భావి స్తున్నానన్నారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెక్యులర్, ఫెడరల్, ప్రజాస్వామ్య విలువల రక్షణకు కృషి చేస్తూ చరిత్ర అధ్యాయానికి, భావసంఘర్షణలకు, విజ్ఞాన మార్పిడికి ఒక ప్రధాన వేదికగా ఈ సందర్భంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ "చరిత్రను తెలుసు కోలేని వాళ్ళు చరిత్రను సృష్టించ లేరు" అన్న మాటలను గుర్తు చేశారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం భారతదేశ చరిత్రలోనే ఒక గొప్ప పోరాటం అని తెలిపారు. నూతన వ్యవసాయ సంస్కరణలకు ఈ పోరాటం పునాదులు అటు వంటి చరిత్రను అంద రూ తెలుసు కోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. శాస్త్రీయత, మతం పరస్పర వైరుధ్యాలను కలిగి ఉంటాయన్నారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్ఎ.నదీం రేజావి మాట్లాడుతూ.. నియంతృత్వ, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ఎలా పోరాడిందో వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ చరిత్ర కారులు రామ చందర్ గుహకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించారు. ఏడుగురి ఉత్తమ పుస్త కాలకు, 10 ఉత్తమ పత్రాలకు అవార్డులు, నగదు బహుమతిని ప్రకటిం చారు. ఈ సందర్భంగా 81వ కాంగ్రెస్ సమావేశాల పుస్త కాల సంపుటిని ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాసరా వు స్వాగత ఉప న్యాసం చేశారు. లోకల్ హిస్టరీ కాంగ్రెస్ సెక్రటరీ ఆచార్య టి.మనోహర్ వందన సమర్పణ చేశారు. 1030కి పైగా పత్రాల 1200 మంది ప్రతినిధులు దేశ వ్యాప్తంగా హాజరుకాగా ఇద్దరు విదేశీ ప్రతినిధులు మహ మ్మూద్ అహ్మద్ (ఉజ్బెకిస్తాన్), రీతు కందూరి (అమెరికా సంయుక్త రాష్ట్రాల) నుంచి హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు.

దేశాన్ని ఐక్యం చేసిన కాంగ్రెస్

- మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రజలందరినీ ఐక్యం చేసి బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్ర్యం తేవడంలో కాంగ్రెస్ కీలకపాత్ర పోషించిందని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ గుర్తు చేశారు. స్వతంత్ర పోరాటంలో ఎంతో మంది తమ కుటుంబాలను, ఆస్తులను త్యాగం చేశారని తెలిపారు. ఏండ్ల తరబడి జైళ్లలో మగ్గి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో దేశంలో ప్రజలు తీవ్రమైన పేదరికంలో ఉన్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ పార్టీ జెండాను ఎగురవేశారు. 1885 డిసెంబర్ 28న బొంబాయిలో 72 మందితో ఏర్పడ్డ జాతీయ కాంగ్రెస్ పార్టీ నేడు దేశంలోని 140 కోట్ల ప్రజల హృదయాలను గెలుచుకుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. 50 ఏండ్లపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రపంచంలో ఒక బలమైన ఆర్థిక పరిపుష్టి గల దేశంగా భారత్ తీర్చిదిద్దిందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నాయకులు జి నిరంజన్, కోదండరెడ్డి, మెట్టుసాయికుమార్, ఏఐసీఎస్ జాయిట్ సెక్రటరీ గాండ్ల మల్లేషం తదితరులు పాల్గొంటారు.

IN THE HON'BLE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT :: L.B. NAGAR
O.S. No. 1268 OF 2022

Between:
State Bank of India,
Karmanghat Branch,
House No. 10-1-96/4 A 86B,
Plot No. A, B, C, D, Kishan Kumar Complex,
Durga, Nagar Colony, Lingojiguda, Srinidhi Colony, Karmanghat, Ranga Reddy,
Telangana - 500074
Rep. by its Branch Manager
Sri Praveen Kumar Reddy
... Plaintiff

AND

Jinukuntla Dananjaiah Goud S/o J. Estari
Aged about 46 years, Occ: Employee
H.No.9-6-32, Durga Bhavani Nagar Road, Road No.6, Champapet,
Hyderabad - 500 079.
... Defendant

Please take notice that you are evading to receive summons sent by this Hon'ble Court. The above mentioned Hon'ble Court was pleased to order notice to you .by way of publication in this daily. You are hereby directed to appear either in person or through duly instructed Advocate at **10-30** AM on **16-01-2024** in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

SMT. RAPAKA ARUNA, B.A, B.L.,
Advocate
11-78, Flat No.203, Sri Sai Manssion,
Pragathinagar, Gaddiannaram,
Hyderabad - 500 060.
Cell: 9030617991

జొమాటోకు రూ.401 కోట్ల జిఎస్‌టి డిమాండ్ నోటీసు

న్యూఢిల్లీ : ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వేదిక జొమాటోకు 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్(డిజిజిఐ) డిమాండ్ నోటీసులు జారీ చేసింది. వినియోగదారుల నుంచి వసూలు చేసిన డెలివరీ ఫీజుపై జిఎస్‌టికి సంబంధించిన బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపింది. రూ.401 కోట్లు బకాయి పడినట్లు నోటీసులో పేర్కొంది. డెలివరీ అనేది సేవ కాబట్టి 18 శాతం జిఎస్‌టి చెల్లించాల్సిందేనని డిజిజిఐ స్పష్టం చేసింది.

డిమ్యాట్, ఎంఎఫ్ నామినీ డిక్లరేషన్‌కు గడువు పెంపు

న్యూఢిల్లీ : డిమ్యాట్, మ్యూచువల్ ఫండ్స్ ఖాతాదారులు తమ నామినీల పేర్లు నమోదు చేయడానికి పెట్టుబడుల రెగ్యులేటరీ సంస్థ సెబీ మరింత గడువు ఇచ్చింది. ఈ గడువును 2024 జూన్ 30 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇది వరకు ఇచ్చిన అవకాశం డిసెంబర్ 31తో ముగియనుంది. అనుహ్య పరిణామాలు చోటు చేసుకున్నప్పుడు ఇన్వెస్టర్ల పెట్టుబడులకు భద్రత కల్పించేందుకు.. వారసులకు సొమ్ము అప్పగించేందుకు నామినీ డిక్లరేషన్ సమర్పించాలని సెబీ సూచించింది.

ప్రజాపాలనకు బారులు తీరిన ప్రజలు

- దరఖాస్తుల కోసం పడిగాపులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమానికి మొదటి రోజు జనం పోటెత్తారు. ఉదయం నుంచే గ్రామ, వార్డు సభల వద్ద ప్రజలు బారులు తీరారు. చాలా ప్రాంతాల్లో అనుకున్న స్థాయిలో దరఖాస్తులు అందుబాటులో లేక ఇబ్బందులు తలెత్తాయి. ఇదే అవకాశంగా తీసుకున్న కొంతమంది దళారులు, జీరాక్స్ సెంటర్ల యజమానులు దరఖాస్తు ఫారాలను బ్లాక్‌లో విక్రయించారు. ఒక్కో ఫారంను రూ.50 నుంచి రూ.100 రూపాలకు అమ్మారు. చాలా కౌంటర్ల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో పేదలు వాటినే కొనుక్కున్నారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి, చందానగర్ తదితర ప్రాంతాల్లో సహనం కోల్పోయిన ప్రజలు ఆందోళనకు దిగారు. దరఖాస్తులో ప్రభుత్వం నిర్దేశించిన రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల, చేయూత, రేషన్ కార్డులు కాకుండా ఇతర సమస్యలపైనా అర్జీలు సమర్పించారు.

శ్రేయ నాట్యం లలిత మనోహరం

ప్రజాశక్తి - కల్చరల్

అభినయంలో చురుకుదనం భావాలను పలికించగల నేత్రాలు పద ముద్రలలో ప్రతిభ కలసిన శ్రియ పన్నాల కూచిపూడి నాట్య శైలిలో రంగప్రవేశం చేశారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై ప్రముఖ నాట్య గురువు పావనీ లలితాప్రసాద్ శిష్యురాలు శ్రియ నాట్యరంగ ప్రవేశం జరిగింది.తొలి అంశంగా గణపతి స్తుతితో తన నర్తనం అరభించిన శ్రియ తదుపరి అంశంగా కోటిరెడ్డి రచించిన శ్రీకృష్ణ జనన శబ్దంలో పదముద్రలలో పరిణితి ప్రదర్శించారు. డివిఎస్ మూర్తి రచించిన గాయత్రీదేవి ప్రవేశ దరువు అరుదైన కీర్తనను శ్రియ నర్తించి చివరి అంశాలు జావళిలో నవరస భావాలను ప్రదర్శించి తిల్లనతో నర్తనం పూర్తి చేశారు. నట్టువాంగం శ్రీలత ప్రసాద్ చేయగా చంద్రరావు గాత్ర సహకారం అందించారు. చంద్రకాంత్ మృదంగంపై మురళి వేణువుపై జయకుమారాచార్య తబలా పై సహకరించారు.

2024 ఎన్నికల్లో బిజెపిని నిలువరిస్తాం..

- యుద్ధాలు ఆపకపోతే ఆర్థిక మాంద్యం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

జిల్లా విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామిక రక్షణ, పౌరహక్కుల కోసం 'ఇండియా' కూటమితో కలిసి 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి గెలుపును అడ్డుకుంటామని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్ అధ్యక్షతన సిపిఎం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల పాలనలో ఈ దేశంలో 15 నుంచి 20 మంది పెట్టుబడుదారుల ఆస్తులు 16 లక్షల కోట్లకు పెరిగాయన్నారు. అదానీ, రిలయన్స్ పెట్టుబడుదారులు ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకొని తక్కువ సమయంలో వేల కోట్లకు పడగలెత్తారని చెప్పారు. పెరుగుతున్న నిరుద్యోగం, ధరలు, ఆకలి మంటలతో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తప్పించుకునేందుకు బిజెపి మతం పేరుతో రాజకీయాలు చేస్తోందన్నారు. మైనార్టీ వర్గాలు, ప్రజాస్వామ్య వాదులపై దాడులు, దేశద్రోహ కేసులు పెడుతూ జైలుకు పంపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంపై దాడి చేసి పౌరహక్కులను హరిస్తోందన్నారు. ప్రశ్నించిన రైతు ఉద్యమ నాయకులను, ప్రజా సంఘాల నాయకులను జైలుకు పంపిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. మూడోసారి దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమ్మెలపైనా ఎమర్జెన్సీ విధించే ప్రమాదం ఉందన్నారు.

దేశాన్ని రక్షించుకునేందుకు ఇండియా కూటమిలోని 28 పార్టీలను కలుపుకొని వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించడంలో సిపిఎం ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. దేశంలో 260 పార్లమెంటు స్థానాల్లో బలం ఉన్న కాంగ్రెస్ పార్టీ కూటమిలోని ఇతర పార్టీలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచంలో అమెరికా గోధుమల వ్యాపారం కోసం, ఆయిల్ ఉత్పత్తుల కోసం రష్యా- ఉక్రెన్ మధ్య యుద్ధం, ఇజ్రాయిల్‌లో యుద్ధాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. యుద్ధాలను పూర్తిగా ఆపాలని ప్రపంచ దేశాలు కోరుకుంటుంటే.. మన ప్రధాని నరేంద్ర మోడీనేమో అమెరికాతో స్నేహబంధం కోసం కొన్ని రోజులు ఆపాలని మాత్రమే చెప్పడం సరైంది కాదన్నారు.

ప్రపంచ దేశాల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని యుద్ధాలు ఆపకపోతే ప్రపంచంతో పాటు దేశంలో కొనుగోలు శక్తి ఉన్నప్పటికీ ఉత్పత్తులు తగ్గి ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్, జిల్లా కార్యదర్శి ఎ రాములు, సీనియర్ ఆర్ రాంరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు నల్లవెల్లి కురుమూర్తి, పద్మ, చంద్రకాంత్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యాసంగిలో అత్యల్ప సాగు

- తొమ్మిది జిల్లాల్లో పది శాతం కంటే తక్కువ
- వ్యవసాయ శాఖ నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణలో 24 జిల్లాల్లో 20శాతం కంటే తక్కువగా పంటలు సాగవుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. రాష్ట్రంలో పది శాతం కంటే తక్కువ సాగు చేసే జిల్లాలు తొమ్మిది, 20శాతం కంటే తక్కువ సాగు చేసే జిల్లాల సంఖ్య 24గా పేర్కొంది. మొత్తంగా యాసంగిలో నిరుటి కంటే ఈ ఏడాది పంటల సాగు గణనీయంగా తగ్గిందని తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వానికి తాజాగా నివేదిక ఇచ్చింది. జయశంకర్ భూపాలపల్లిలో 0.95 శాతం, మెదక్ జిల్లాలో 1.64, పెద్దపల్లిలో 1.65, ములుగులో 4.10, కరీంనగర్‌లో 4.81, యాదాద్రి జిల్లాలో 6.90, వరంగల్‌లో 7.45, సిద్దిపేటలో 7.73, ఖమ్మం 9.28, జగిత్యాల 9.46, సిరిసిల్ల 9.80, జనగామ 9.83 శాతాల చొప్పున సాగు జరుగుతోందని వ్యవసాయ శాఖ పేర్కొంది. హనుమకొండలో 10.36, నల్గొండ 10.66, రంగారెడ్డిలో 11.43, మహబూబ్‌నగర్‌లో 12.29, నారాయణపేట 12.41, భద్రాద్రిలో 12.94, సూర్యాపేట 12.79, మహబూబాబాద్ 14.50, వనపర్తి 16.94, మంచిర్యాల 17.80, మేడ్చల్ 18.26, సంగారెడ్డి 18.99 శాతం మేరకు పంటలు వేసినట్లు తెలిపింది. ఆదిలాబాద్ జిల్లాలో 70.61 శాతం, నిర్మల్ జిల్లా 54.66, నిజామాబాద్ 52.12 శాతాల చొప్పున పంటలు సాగవుతున్నాయి. రాష్ట్రంలో వరి 40.50 లక్షల సాగు లక్ష్యానికి గాను 2.93 లక్షల (7.24 శాతం) మేరకు పంటలు వేశారు. పెసలు, ఉలవలు, బొబ్బర్లు, నువ్వులు 25 శాతం కంటే తక్కువగా ఉండగా మొక్కజొన్న, జొన్న, గోధుమ, పొద్దుతిరుగుడు 30 శాతం దాటిందని, వేరుసెనగ, మినుములు, కుసుమలు, శనగ పంటలు 50 శాతం మేరకు సాగవుతున్నాయని వ్యవసాయ శాఖ పేర్కొంది.

ముగిసిన ఎస్‌బిఐ జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆల్ ఇండియా ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఐదు రోజుల పాటు సాగిన పోటీల ముగింపు కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథితులుగా ఎస్‌బిఐ ముంబయి కార్పొరేట్ సెంటర్ సిడిఓ అండ్ డిఎండి (హెచ్‌ఆర్) ఒపి మిశ్రా, హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్ కుమార్, అమరావతి సర్కిల్ సిజిఎం నవీన్ చంద్ర ఝా హాజరయ్యారు. ఎస్‌బిఐ బెంగళూరు సర్కిల్ మెరుగైన ప్రతిభను కనబర్చి అగ్రస్థానంలో నిలిచింది. రన్నరప్‌గా హైదరాబాద్ సర్కిల్ బృందం నిలిచింది. మొత్తం టర్నోమెంట్ కాంపిటీటివ్ స్పిరిట్‌తో జరిగిందని నిర్వాహకులు తెలిపాయి. చివరి రోజు అద్భుతమైన డ్యాన్స్, ఇతర కల్చరల్ కార్యక్రమాలతో టోర్నీని ముగించారు.

చదువుతో పాటు ఆటల్లోనూ మేటి.. గురుకులాలు

- ఇంటర్నేషనల్ స్థాయికి ప్రోత్సాహం
- డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి
- రాష్ట్ర స్థాయి గిరిజన గురుకులాల బాలికల క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి

రాష్ట్రంలోని గురుకులాల విద్యార్థినీ, విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ మేటని గిరిజన గురుకులాల డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలోని సుదిమల్ల గిరిజన గురుకుల బాలికల కళాశాలలో గురువారం డిసెంబర్ 28 నుంచి 31వ తేదీ వరకు తెలంగాణ 7వ రాష్ట్ర స్థాయి గిరిజన గురుకులాల బాలికల క్రీడా పోటీలు ప్రారంభించారు. తొలుత జెండా వందనం నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ టి వెంకటేశ్వరరాజు అధ్యక్షతన, ప్రిన్సిపాల్ అరుణకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 1200 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన బాలుర రాష్ట్రస్థాయి క్రీడలు కాటారంలో జరుగుతున్నట్లు తెలిపారు. ఇటీవల జోనల్ స్థాయిలో క్రీడలు నిర్వహించామని, అందులో ప్రతిభ కనబరిచిన మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థిని, విద్యార్థులకు 7వ రాష్ట్ర స్థాయి బాలికల క్రీడా పోటీలకు అవకాశం కల్పించామన్నారు. మెరుగైన ఫలితాలు కనబరిచిన వారికి ఇంటర్ సొసైటీ లీగ్‌లో అవకాశం కల్పిస్తామని తెలిపారు. అన్ని విధాల తర్ఫీదు ఇప్పించి గురుకులాలను రాష్ట్రస్థాయితో పాటు ఇంటర్నేషనల్ స్థాయికి ప్రోత్సహిస్తామన్నారు. కాగా, క్రీడా పోటీలను అండర్ 14, అండర్ 17, అండర్ 19 వారీగా నిర్వహిస్తున్నారు. కబడ్డీ, వాలీబాల్, కోకో, టెన్నికాయిట్, హాకీ, క్యారమ్స్, బాల్ బ్యాట్మెంటన్, బాక్సింగ్, హ్యాండ్ బాల్, 100 మీటర్స్, 200 మీటర్స్, 1500 మీటర్స్, లాంగ్ జంప్, హై జంప్, 600 మీటర్స్ రిలే, 400 మీటర్స్ రిలే వివిధ విభాగాలకు సంబంధించిన క్రీడలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన గురుకులాల ఒఎస్‌డి శ్రీనివాస్ కుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ రవి కుమార్, వివిధ జిల్లాలకు చెందిన రీజనల్ కో ఆర్డినేటర్స్, గిరిజన గురుకుల కళాశాల, పాఠశాలల ప్రిన్సిపల్స్, సుమారు వందమంది పిఇటి, పిడిలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మీ-సేవ.. బతుక్కి లేదు భరోసా

- అర్ధాకలితో ఉద్యోగులు
- పెరగని జీతాలు-తీరని వెతలు
- పిఎఫ్ ఎగ్గొట్టిన ఏజెన్సీ
- 'గ్యారెంటీలు, కొత్త రేషన్‌కార్డులు' అంటూ సర్కారు హల్‌చల్
- దళారీ వ్యవస్థతో శ్రమదోపిడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఊళ్ళో వాళ్లంతా తమ సమస్యల పరిష్కారం కోసం 'మీ-సేవ' కేంద్రాలకు వెళ్తారు. జనన, మరణ, ఆదాయ, నివాస, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్, ధరణి, ఓటర్ గుర్తింపు సహా 1,500 రకాల సేవలు ఇక్కడే లభిస్తాయి. నిత్యం దరఖాస్తుదారులతో కిటకిటలాడుతూ ఉంటాయి. వీరందరికీ ఒపిగ్గా సేవలు అందించే 'మీ-సేవ' ఉద్యోగుల కష్టాన్ని పట్టించుకొనే దిక్కు మాత్రం కనుచూపు మేరలో కనిపించట్లేదు. ఈ కేంద్రాల్లోని ఉద్యోగులు 20 ఏండ్లకు పైగా ఇక్కడే పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ కావడంతో, ఈరోజు కాకుంటే రేపైనా తమ బతుకులు మారకపోతాయా... అనే ఆశతో కాలాన్ని నెట్టుకొస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వారి ఆశను ఆసరా చేసుకొని శ్రమదోపిడీకి పాల్పడుతున్నది. వారి సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవట్లేదు. ప్రభుత్వానికి వచ్చే సింహభాగం ఆదాయాన్ని ప్రజల నుంచి వసూలు చేసి, సర్కారు ఖజానాకు జమచేసిది ఇక్కడి ఉద్యోగులే. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మీ-సేవా కేంద్రంలో 20 ఏండ్లుగా ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి జీతం కేవలం రూ.13 వేలు మాత్రమే. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పనిచేసే మీసేవా ఆపరేటర్ల వేతనం రూ.8 నుంచి 10 వేల లోపే... గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 20 ఏండ్లుగా మీ-సేవా మేనేజర్ జీతం రూ.17వేలు. హౌస్‌కీపింగ్‌లో పనిచేసే ఉద్యోగి జీతం నెలకు రూ.5,305 మాత్రమే. జిల్లాల్లో వీరికిచ్చే వేతనాలు మరింత తక్కువ. 1998లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వంద ఈ-సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వీటి పేరును 'మీ-సేవ'గా మార్చారు. దాదాపు 600 మందికి పైగా ఉద్యోగులు అప్పటి నుంచీ ఇక్కడ పనిచేస్తున్నారు. వీరికెవ్వరికీ కనీస వేతనాలు లేవు. జీతాలు పెంచాలని అనేకసార్లు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసిన ఫలితంగా మూడేండ్ల క్రితం నుంచి ఏటా మూడు శాతం పెంచుతామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం కాస్తో కూస్తో వేతనాలు పెంచుతున్నది. మీ-సేవ కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎవర్నీ కనీసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా కూడా గుర్తించకపోవడం గమనార్హం. ఐటీ శాఖ పరిధిలోని తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) ద్వారా మీసేవా కేంద్రాల నిర్వహణ కొనసాగుతున్నది. కానీ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు మాత్రం ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య దళారీ వ్యవస్థను (ఏజెన్సీ) ఏర్పాటు చేశారు. ఈ దళారీ ఏజెన్సీలు రికార్డుల్లో చూపించే వేతనాలకు, ఉద్యోగులకు ఇస్తున్న జీతాలకు సంబంధం లేదు. పైపెచ్చు ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్)లో ఉద్యోగి జీతం నుంచే యాజమాన్య వాటా కూడా కట్ చేస్తున్నారు. రికార్డుల్లో ఎక్కువ జీతం ఇస్తూ, పిఎఫ్‌ను తామే చెల్లిస్తున్నట్టు చూపిస్తున్నారు. ఏడాది క్రితం ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య దళారీ సంస్థగా వ్యవహరించిన 'కేటలాగ్ ఏజెన్సీ' పిఎఫ్ సొమ్మును స్వాహాచేసి, ఉద్యోగుల కడుపులు కొట్టింది. దీనిపై ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్‌కు ఫిర్యాదు చేస్తే, సదరు సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి, మరో దళారీ సంస్థ గ్లోబస్ ప్రయివేట్ లిమిటెడ్‌కు బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకున్నారు. 'కేటలాగ్' స్వాహా చేసిన సొమ్మును మాత్రం ఉద్యోగుల పిఎఫ్ ఖాతాల్లో జమచేయలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని ప్రకటించింది. ఈనెల 28వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలంటే 'మీ-సేవా' కేంద్రాలే వారధి. ఇప్పటికే సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండటంతో పదిమంది చేయాల్సిన పనిని నలుగురు ఉద్యోగులే చేస్తున్నారు. అన్ని కార్యాలయాల్లో ఉద్యోగులు 12 గంటలకు పైగా పనిచేస్తున్నారు. తీవ్రమైన శారీరక, మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు. గ్రేటర్ పరిధిలోని ఒక్కో మీసేవా కేంద్రంలో రోజుకు 500 నుంచి 700 ట్రాన్సాక్షన్స్ జరుగుతున్నాయి. కొన్ని చోట్ల మహిళా ఉద్యోగినులకు మరుగుదొడ్లు కూడా లేవు. ఫ్యాన్లు అలంకారం ప్రాయంగా మిగిలాయి. కంప్యూటర్ల కోసం అవసరమైన ఏసీల ఊసే లేదు. నిత్యం వందలాదిమంది ప్రజలు మీసేవా కేంద్రాలకు వస్తున్నారు. వారికోసం కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు. తమ జీతాలు, సౌకర్యాల కోసం మీసేవా ఉద్యోగులు అనేకసార్లు ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్‌కు విన్నవించారు. వినతిపత్రాలు ఇచ్చారు. ఉద్యోగులు ఎప్పుడు వినతిపత్రాలు ఇచ్చినా 'డిస్కస్' అని రాసి పంపడం తప్ప, ఒక్క సమస్యా పరిష్కారమైన దాఖలాలు లేవు.

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి- జే వెంకటేష్, గౌరవాధ్యక్షులు
తెలంగాణ మీ-సేవా ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)

ప్రజలకు ప్రభుత్వ పథకాలు మీసేవా కేంద్రాల ద్వారానే అమలవుతున్నాయి. ఇక్కడి ఉద్యోగులను మాత్రం సర్కారు పట్టించుకోవట్లేదు. వారిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనాలు ఇవ్వాలి. సిబ్బంది సంఖ్య పెంచాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

ఈ జీతాలతో ఎలా బ్రతకాలి? ఆర్ సురేష్, అధ్యక్షులు
తెలంగాణ మీ-సేవా ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)

చాలీచాలని జీతాలతో ఆర్థికంగా నానా అవస్థలు పడుతున్నాం. అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చాం. రోడ్లెక్కి ఆందోళనలు చేశాం. సర్దుకుపోవడమే తప్ప, సమస్యలు పరిష్కరించుకోలేకపోతున్నాం. కనీసం కొత్త ప్రభుత్వమైనా మా సమస్యల్ని పరిష్కరించాలి. మమ్మల్ని ఉద్యోగులుగా గుర్తిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి.

చాలా బాధగా ఉంది
డీ ముత్యాలరావు, మీ-సేవ మేనేజర్

20 ఏండ్ల సర్వీసు, వయసంతా ఇక్కడ సేవ చేయడంతోనే ఐపోయింది. భవిష్యత్‌పై ఆశతో ఇక్కడే కొనసాగుతున్నాం. దారిద్ర్య రేఖ (బిపిఎల్) కుటుంబాలకంటే దిగువన ఉన్నాం. ప్రభుత్వం మా సేవల్ని గుర్తించాలి. సర్వీసును రెగ్యులరైజ్ చేయాలి. కష్టాలతో మా కన్నీళ్లు ఇంకిపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాకు న్యాయం చేయాలి.

20 ఏళ్ల సర్వీసు : అరుంధతి, మీ-సేవా ఉద్యోగి

20 ఏండ్లుగా మీసేవలో పనిచేస్తున్నా. ఇప్పటికి నా జీతం కేవలం రూ.13వేలు. కుటుంబాలతో ఎలా బ్రతకాలి. ఈ తక్కువ జీతాలతో వీరెలా బ్రతుకుతారు అని కనీసం ప్రభుత్వాలు ఆలోచన చేయవా? తలుచుకుంటే కడపుతరుక్కు పోతుంది. ఏం చేయలేని నిస్సహాయులుగా ఉండిపోతున్నాం.

ట్రాఫిక్ చలానా చెల్లింపునకు విశేష స్పందన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల చెల్లింపునకు వాహనదారుల నుంచి విశేష స్పందన వస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9.61 లక్షల చలాన్ల చెల్లింపులతో రూ.8.44 కోట్ల ఆదాయం లభించిందని రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ పరిధిలో 3.54 లక్షల చలాన్ల ద్వారా రూ.2.62 కోట్లు, సైబరాబాద్ పరిధిలో 1.82లక్షల చలాన్ల చెల్లింపు ద్వారా రూ.1.80 కోట్లు, రాచకొండ పరిధిలో 93వేల చలాన్లకు రూ.76.79 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. చెల్లింపుల తాకిడితో తరచూ సర్వర్ హ్యాంగ్ అవుతోంది. పెండింగ్ చలానాలపై భారీ డిస్కౌంట్ ప్రకటిస్తూ మంగళవారం జివో విడుదలైంది. టూ వీలర్స్, త్రీ వీలర్స్ వాహనాలపై 80 శాతం, ఫోర్ వీలర్స్, హెవీ వెహికల్స్‌పై 60 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఆర్టీసి బస్సులకు ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇచ్చింది. ఈ మేరకు రవాణా శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గత నెలాఖరుకు చలానాల సంఖ్య 2 కోట్లకు చేరుకుందని అంచనా. ఈ నేపథ్యంలో మరోమారు రాయితీ ప్రకటించారు. నిర్ణీత వ్యవధిలో చలానాలు చెల్లించేవారికే ఈ రాయితీ వర్తిస్తుంది.

కాటన్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

- సుమారు రూ.60 లక్షల పత్తి దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా ములుగు మండలం జాకారం సమీపంలోని శ్రీ రాజరాజేశ్వర కాటన్ ఇండస్ట్రీలో ఎయిర్ కంప్రెషర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడి సుమారు రూ.60 లక్షల విలువచేసే పత్తి కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ఇండస్ట్రీ యజమానులు, సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు జిన్నింగ్ మిల్లు నడుస్తున్న క్రమంలో మిల్లులోని ఎయిర్ కంప్రెషర్‌లో షార్ట్ సర్క్యూట్ వచ్చి మంటలు ఎగసిపడ్డాయి. ఆ మంటలు పత్తిపై పడి అంటుకొని పొగ రావడంతో యజమానులు అప్రమత్తమయ్యారు. అప్పటికే మిల్లులో సుమారు రూ.రెండు కోట్ల విలువైన పత్తి నిలువ చేసి ఉంది. యజమానులు, సిబ్బంది అప్రమత్తమై మిల్లులో ఏర్పాటుచేసిన ఫైర్ సేఫ్టీ సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూ వెంటనే ములుగు, పరకాల, నర్సంపేట ఫైర్ స్టేషన్లకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ ఇంజన్లు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దాంతో సుమారు రూ.1.40 కోట్ల విలువగల పత్తిని కాపాడుకోగలిగామని ఇండస్ట్రీ మేనేజింగ్ పార్ట్‌నర్ కూకట్ల సత్యనారాయణ తెలిపారు. మిల్లులోని ఫైర్ సేఫ్టీ, ఫైర్ ఇంజన్లు సకాలంలో అందకుంటే ఇంకా భారీ నష్టం జరిగేదని యజమానులు తెలిపారు.

సమస్యలతో విద్యారంగం సతమతం

- ఇబ్బందుల్లో 'సంక్షేమ', గురుకుల, కెజిబివి విద్యార్థులు
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగర ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో సతమతమవుతోందని, ప్రధానంగా సంక్షేమ వసతిగృహాలు, గురుకుల, కెజిబివి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా మాట్లాడుతూ గత ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచినట్టు ప్రకటించినా అమలు కావడం లేదన్నారు. ఏడాది నుంచి హాస్టల్స్ మెస్ బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కెజిబివి, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. నాలుగేండ్ల నుంచి సుమారు రూ.7,792 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్‌మెంట్స్ విడుదల చేయలేదని, హాస్టల్స్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీల ఊసేలేదని అన్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా విద్యార్థులందరికీ ఉచిత బస్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపాలని ఎమ్మెల్యేలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, జిల్లా ఉపాధ్యక్షుడు స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రశాంత్, నాయకులు విగ్నేష్, రాజేష్, భగత్ హస్మీ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పిఎస్ పరిధిలోని శ్రీచైతన్య కళాశాలలో గురువారం జరిగింది. మేడిపల్లి సిఐ పి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణానికి చెందిన బి ఒరయ్య కుమార్తె వర్ష (17) పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో ఉన్న శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం హాస్టల్ బాత్‌రూంలో ఆమె ఉరేసుకుంది. తోటి విద్యార్థినులు గమనించి యాజమాన్యానికి చెప్పారు. కళాశాల యాజమాన్యం మేడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు కళాశాలకు వెళ్లి పరిశీలించారు. వర్ష మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక పోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్టు కళాశాల యాజమాన్యం చెబుతోంది.

శ్రీచైతన్య డీన్ మమత వేధింపులు భరించలేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని టివిఎస్ విద్యార్థి సంఘం నాయకులు హరీష్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని, దీనికి బాధ్యత వహిస్తూ యాజమాన్యం డీన్ మమతను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. దీనిపై ఇంటర్మీడియట్ బోర్డు ఒక కమిటీ వేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రి పొంగులేటికి టిగ్లా శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ ఇంటర్మీడియెట్ గవర్నర్‌మెంట్ లెక్చరర్ల అసోసియేషన్ (టిగ్లా) అధ్యక్షులు మైలారం జంగయ్య, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ నేతృత్వంలో గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు ప్రకటించారు. ప్రభుత్వ కాలేజీల బలోపేతం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిగ్లా జాయింట్ సెక్రెటరీలు బండారి లక్ష్మయ్య, మంజునాయక్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల పరశురాములు, నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.